క్లుప్తంగా

ఘనంగా కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం



కనక మహాలక్ష్మి అమ్మవారు

పి.గన్నవరం: నరేంద్రపురంలో వేంచేసిన కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు క్యూలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. మేళ తాళాలు, గరగ నృత్యాలతో అమ్మవారి జాతర నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ నాయకులు ఆధ్వర్యం వహించారు.

ముగిసిన పృథ్వీశ్వరస్వామి కల్యాణోత్సవాలు



చింతలూరులో పృథ్వీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన స్వయంభూ శ్రీపార్వతీ సమేత పృథ్వీశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు పూర్తయ్యాయి. స్థానిక ఆలయంలో గత ఐదు రోజుల నుంచి జరుగుతున్న ఈ కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య దేవతామూర్తులకు శ్రీపుష్పయాగం నిర్వహించారు. ఈసందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భారీ అన్న సమారాధన




మొగలికుదురులో అన్నసమారాధనకు హాజరైన భక్తులు

మామిడికుదురు: గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భారీగా భక్తులు అన్న సమారాధనకు హాజరయ్యారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అన్న సమారాధనతో అయిదు రోజుల పాటు ఘనంగా జరిగిన అమ్మవారి జాతర మహోత్సవాలు సంపూర్ణమయ్యాయి. అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అమ్మ వారి జాతర మహోత్సవాలను అయిదు రోజులు ఘనంగా జరిపించారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

అంబాజీపేట: జాతీయ స్థాయి మీన్స్ కమ్ మెరిట్ ఉపకార వేతనాల ఎంపిక పరీక్షలో అంబాజీపేట మండలంలోని 9 జెడ్పీ హైస్కూళ్లకు సంబంధించి నలుగురు విద్యార్థులు తమ సత్తా చాటి ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పరీక్షల్లో తొండవరం నుంచి ములపర్తి నమిత, ఇసుకపూడి నుంచి జల్లి గ్రేసి, గంగలకుర్రు నుంచి రావి శైలజ అన్నపూర్ణ, కె.పెదపూడి నుంచి నెల్లి బాలభవాని జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల వరకు అందజేస్తారని ఎంఈఓ తెలిపారు.

స్వామివారి సన్నిధిలో రాజోలు ఎమ్మెల్యే



అంతర్వేది ఆలయంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌కు స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం రాజోలు జనసేన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. వెంట ప్రముఖ పారిశ్రామికవేత్త లింగోలు పెద్దబ్బులు, ఎంపీటీసీ భైర నాగరాజు, జేఎస్పీ, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో జోరుగా నారుమళ్లు

- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- స్వర్ణ రకం సాగుకు రైతుల మొగ్గు
- నారుమళ్ల ప్రక్రియలో జాగ్రత్తలు తప్పనిసరి



కె.నాగేశ్వరరావు



కలవచర్లలో ఖరీఫ్ పంటకు సంబంధించి వరినాట్లు వేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా ఖరీఫ్ పంటకు సంబంధించి నారుమళ్ల ప్రక్రియ జోరుగా సాగుతుంది. ఖరీఫ్‌లో 60 శాతం మేర వెదజల్లు సాగు చేపడుతుండగా మిగతా భూమిలోని సాగుకు నారుమళ్ల ప్రక్రియ చురుగ్గా సాగుతుంది. తూర్పు డెల్టా ప్రధాన కాలువకు ఈనెల ఐదున సాగునీరు విడుదల చేయడంతో ఖరీఫ్ సాగు అనుకున్న సమయాని కంటే ముందుగా రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే కొత్తపేట, రాజోలు, పి.గన్నవరంలోని 73 ఆర్‌బీకేల్లో ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఖరీఫ్ పెట్టుబడి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తొలి విడత రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసింది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడంతో పాటు త్వరిత గతిన కోతకు వచ్చే అవకాశం ఉండటంతో వ్యవసాయశాఖ ఈ ఖరీఫ్‌లో స్వర్ణ (7029,), ఎంటీయూ (1318), ఎంటీయూ (1121) రకాలు వినియోగించాలని వ్యవసాయశాఖ సూచనలిస్తున్న రైతుల మాత్రం స్వర్ణ (7029) రకానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రతి గ్రామంలోనూ పవర్ టిల్లర్లు రాయితీపై అందించడంతో చేలల్లో దమ్ము ప్రక్రియ శరవేగంగా జరుగుతుంది.

జూలై 15 నాటికి వరినాట్లు పూర్తి చేయాలి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జూలై 15 నాటికి వరి నాట్లు ప్రక్రియను పూర్తి చేయాలని మండల వ్యవసాయశాఖ చెబుతుంది. దీనివల్ల అక్టోబర్ నెలాఖరు నాటికి వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ఏటా నవంబర్ నెలలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలను నుంచి తప్పించుకోవచ్చు. మళ్లీ డిసెంబర్ చివరి నాటికి రబీ సాగుకు సంబంధించి వరినాట్లు పూర్తి చేస్తే వచ్చే ఏడాది మార్చి నాటికి రబీ సాగు చేతికొస్తుంది. దీనివల్ల మూడో పంటగా అపరాల సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వ్యవసాయశాఖ సూచనలు కచ్చితంగా పాటిస్తూ భూసారం పెరిగి ప్రతి ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాలు అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు

- నారుమడుల తయారీలో కనీస యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను పాటిస్తే పెట్టుబడి ఆదా అవడంతో పాటు నాణ్యమైన పంటలను పండించవచ్చని ఆలమూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు చెబుతున్నారు.
- తొలుత 80 శాతం మొలక కలిగిన నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేయాలి.
- నారుమడులను ఏర్పాటు చేసుకునేందుకు 10–12 రోజుల మధ్య దమ్ము చేసి నేలను చదును చేసుకోవాలి.
- పొలాల్లో నీరు పారేందుకు చిన్న చిన్న కాలువలను ఏర్పాటు చేసుకుని ప్రతి మొక్కకు నీరు అందేలా చూడాలి.
- ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను మిశ్రమం చేసి దుక్కులో వేయాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉండే ప్రదేశంలో భాస్వరాన్ని రెట్టింపు చేయాలి.
- వరి నారు ఆకుగా విచ్చుకునే వరకూ ఆరుతడులుగా నీటిని అందించాలి. ఆకు కొద్దిగా ఎదిగి ఒక దశకు వచ్చిన తరువాత నీటిని నిలకట్టాలి.
- జింక్ లోపం గమనించినట్లయితే లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి.
- చలి ఎక్కువగా ఉంటే ప్రాంతాల్లో దాళ్వా వరి సాగుకు కనిపించే జింక్ లోప లక్షణాలను గుర్తిస్తే సత్వరమే వ్యవసాయశాఖ సూచనలు తీసుకోవాలి.
- నారు తీయడానికి వారం రోజుల ముందు ఎకరాకు సరిపడే ఐదు సెంట్లలో వేసిన నారుమడిని ఒక కేజీ కిర్బోఫ్యూరాన్ గుళికలను తక్కువ నీటిలో సమానంగా చల్లాలి.

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను విజయవంతం చేయాలి



పెదపళ్ల పీహెచ్‌సీలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి మలేరియా వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున, డి.సాయికిషోర్ కోరారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీలతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో శుక్రవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి 30 వరకూ నిర్వహించే మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ఆవశ్యకతను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్లెక్సీలు వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివ ప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

పీఏసీఎస్ ఛైర్మన్ పదవికి 'మునునూరి' రాజీనామా



కొత్తపేట పీఏసీఎస్‌లో తన రాజీనామా లేఖను సీఈఓ ప్రసాద్‌కు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

కొత్తపేట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ ఛైర్మన్ మునునూరి వెంకటేశ్వరరావు ఆ పదవికి రాజీనామా చేశారు. ఆ మేరకు శుక్రవారం తన రాజీనామా లేఖను పీఏసీఎస్ సీఈఓ జగతా ప్రసాద్‌కు అందచేశారు. ఈ సందర్భంగా మునునూరి విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ త్రిసభ్య కమిటీ పదవులకు రాజీనామా చేసినట్టు తెలిపారు. 2019 ఆగస్టు 4 న ఈ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని, అప్పటికి సుమారు రూ.3 కోట్లు ఉన్న సంఘం ఆదాయాన్ని నేటికి రూ.11.30 కోట్లకు పెంచామన్నారు. సుమారు రూ.1.50 కోట్ల మొండి బకాయిలు వసూలుకు కృషి చేశామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సంఘానికి ప్రభుత్వం నుంచి సుమారు రూ.కోటి రావాల్సిందన్నారు. సంఘ కార్యాలయం ముందు స్థలంలో డీసీసీబీ కార్యాలయానికి లీజుకు ఇచ్చే నిమిత్తం నూతన భవనం, షాపింగ్ కాంప్లెక్స్, వాటర్ ప్లాంట్ నిర్మాణం కొరకు డీసీసీబీ కాకినాడ వారికి సుమారు రూ.60 లక్షలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడలో ఉన్న డీసీసీబీని విభజించి కోనసీమ జిల్లా రైతులకు, పీఏసీఎస్‌లకు అందుబాటులో అమలాపురంలో డీసీసీబీని ఏర్పాటు చేయాలని అధికారం చేపట్టనున్న నూతన ప్రభుత్వానికి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

వివాదాస్పద పోస్టులు పెడితే క్రిమినల్ చర్యలు

అయినవిల్లి: సోషల్ మీడియా వేదికగా వివాదాస్పద పోస్టులు పెడితే ఉపేక్షించేది లేదని, వివాదాస్పద పోస్ట్ పెట్టిన వ్యక్తిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై వి.రాజేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో వర్గాలను రెచ్చగొట్టే విధంగా వాయిస్ మెసేజ్ పెట్టిన విషయమై ఉప్పలగుప్తం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ముద్దాయిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వివాదాస్పద పోస్టలను ఫార్వర్డ్ చేయడం కూడా నేరమన్నారు. ఎవరైనా సోషల్ మీడియాలో కులాల మధ్యలో గొడవలు రెచ్చగొట్టేలా ఈ విధమైన సంఘటనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెసేజ్‌ను వెంటనే డిలీట్ చేసి ఆ వ్యక్తిని వెంటనే గ్రూప్ నుంచి తొలగించాలన్నారు. అలా చేయని గ్రూప్ అడ్మిన్ మీద కూడా చర్యలు తీసుకోబడతామన్నారు. గ్రూప్ సభ్యులు ఎవరైనా వివాదాస్పదమైన మెసేజ్‌లు, ఆడియో, వీడియోలను ఇతర గ్రూప్‌లకు పంపించిన, మెసేజ్‌లను తయారు చేసిన వారిని కూడా గుర్తించి వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు.

వర్షంతో అధ్వానంగా రహదారులు



అధ్వాన స్థితిలో మామిడికుదురు కొర్లగుంట రోడ్డు

మామిడికుదురు: రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. భారీ వర్షంతో రహదారులు అధ్వానంగా మారాయి. మామిడికుదురు, నగరం, పాశర్లపూడి గ్రామాల్లోని 216వ నంబర్ జాతీయ రహదారిపై భారీగా ముంపునీరు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాశర్లపూడి సత్రం సమీపంలో జాతీయ రహదారి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ పెద్ద పెద్ద గోతులతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మామిడికుదురు నుంచి కొర్లగుంట వెళ్లే పంచాయతీ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు బురదమయంగా మారడంతో వాహనాలు జారుడు బళ్ల తరహాలో జారిపోతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు అర కిలోమీటరు మేర రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో పాటు అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, లూటుకుర్రు, ఆదుర్రు, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం తదితర గ్రామాల్లో రహదారులపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. ఇదిలా ఉండగా ఈ వర్షాలు కొబ్బరి తోటలతో పాటు మాగాణి సాగుకు ఎంతో అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలి



మామిడికుదురులో బహుమతులు అందుకున్న విద్యార్థులు

మామిడికుదురు: గ్రంథాలయాల్లో విద్యార్థులకు అవసరమైన ఎన్నో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సాయిబాబు సూచించారు. మామిడికుదురు శాఖా గ్రంథాలయంలో గత నెల 15న ప్రారంభమైన వేసవి తరగతుల ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. లైబ్రేరియన్ ఏకేవీఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హెచ్ఎం సాయిబాబు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా వేసవి తరగతులు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. ఏటా ఇదే తరహాలో వేసవి తరగతులు నిర్వహించాలని ఆయన సూచించారు. సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మొల్లేటి శ్రీరామచంద్రమూర్తి, జవహర్, బీడీసీలు యెరుబండి కన్నబాబు, ఎస్.తులసీలక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి కృషి ఫలించింది



ఎమ్మెల్యేగా ఎన్నికైన గిడ్డిని సన్మానిస్తున్న నియోజకవర్గ కన్వీనర్ రాంబాబు

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పని చేశారని, వారి కృషి ఫలించిందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మగటపల్లిలో పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబును అతని స్వగృహం వద్ద శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కూటమిని విజయం పథంలో నడిపించడంలో నామన రాంబాబు ఎంతో కృషి చేశారని, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ విజయపథంలో నడిపించారని గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. గిడ్డి సత్యనారాయణను ఈ సందర్భంగా రాంబాబు ఘనంగా సన్మానించారు. కూటమి శ్రేణులు ఎమ్మెల్యేగా ఎన్నికైన సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు, పార్టీ నేతలు బోనం బాబు, ఈలి శ్రీను, వర్ధినేని వెంకట్రామయ్య, చుట్టుగుళ్ల కిశోర్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, కంకిపాటి నర్సింహారావు, మంద గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లతో రహదారి బురదమయం



మట్టి ట్రాక్టర్లతో బురదతో ఛిద్రమైన రహదారి

అయినవిల్లి: ముక్తేశ్వరం–తొత్తరమూడి రహదారిలో మట్టి ట్రాక్టర్లు, లారీలు విచ్చలవిడిగా తిరగడం వల్ల మట్టి రహదారిపై పడి చిన్నపాటి వర్షానికే బురద మారుతోంది. ఈ రహదారి బురదతో ఛిద్రమై అధ్వానంగా ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి ట్రాక్టర్ల రాకపోకల వల్ల మరింత దారుణంగా తయారైందని స్థానికులు చెబుతున్నారు.. అసలే ప్రమాదకరంగా ఉన్న ఈ రహదారి పైకి మరింత మట్టి చేరడంతో చిన్నపాటి వర్షానికి బురదగా మారి వాహనచోదకులు జారిపడిపోతున్నారు. దీంతో వారి వారి వాహనాలు దెబ్బతినడంతో పాటు గాయాలవుతున్నాయి. అధ్వాన రహదారిపై మట్టి ట్రాక్టర్లు తిరగ కుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ఈ రహదారిని అభివృద్ధి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్యే గిడ్డిని కలసిన నాయకులు



ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను సత్కరిస్తున్న నూర్‌బాషా సంఘ నాయకులు

పి.గన్నవరం: జనసేన పార్టీ నుంచి పి.గన్నవరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన గిడ్డి సత్యనారాయణను శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నూర్‌బాషా సాధికార సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ సుభాన్ శుక్రవారం మర్యాద పూరకంగా కలసి సత్కరించారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ దొరబాబు, నాయకులు ముఖరం హుస్సేన్, సయ్యద్ ఉమర్, షేక్ అమీర్, సత్తార్, మస్తాన్ తదితరులు ఆయన్ను అభినందించిన వారిలో ఉన్నారు. అలాగే మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు పటాన్నల దత్తాత్రేయ, పెంటపాటి శ్రీనివాస్, బొడ్డు వెంకట సతీష్, తమ్మన ప్రసాద్, శ్రీకాకోళపు లక్ష్మీపతి తదితరులు సత్యనారాయణను అభినందించారు. అలాగే టీడీపీ నాయకులు దొక్కా నాథ్‌బాబు, సంసాని పెద్దిరాజు, అంబటి మణికంఠ తదితరులు గిడ్డిని దుశ్శాలువాలతో సత్కరించారు.

30న హోమ్‌గార్డ్ పోటీ పరీక్ష

యానాం: పుదుచ్చేరి పోలీస్ శాఖలో భర్తీ చేసేందుకు హోమ్ గార్డు (పురుషులు, మహిళలు) ఉద్యోగాల పోటీ పరీక్ష ఈ నెల 30న నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఝా శుక్రవారం ఇక్కడ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్ష జరుగుతుందని చెప్పారు. త్వరలో హాల్ టికెట్లు డౌన్‌లోడ్, ఇతర సమాచారం వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తామన్నారు.

నేడు వాడపల్లి రూట్‌లో ట్రాఫిక్ మళ్లింపు

ఆత్రేయపురం: బొబ్బర్లంక–రావులపాలెం వెళ్లే రహదారిలో ఈనెల 8, 9 తేదీల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు సీఐ ఎం.రామ్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సినీ హీరో షూటింగ్ నిమిత్తం ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 8, 9 తేదీల్లో బొబ్బర్లంక నుంచి రావులపాలెం వైపు వచ్చే నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలు, కార్లు, లారీలు, ట్రాక్టర్లు, బస్సులు ధవళేశ్వరం బ్యారేజీ దాటుకుని వేమగిరి, కడియం, జొన్నాడ, రావులపాలెం బ్రిడ్జి మీదుగా చేరుకోవాలన్నారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి వెళ్లే భక్తులు ద్విచక్ర వాహనాల్లో చేరుకోవాలన్నారు. రావులపాలెం నుంచి బొబ్బర్లంక వెళ్లే వారు రావులపాలెం హైవే మీదుగా వేమగిరి నుంచి బొబ్బర్లంక చేరుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు యథావిధిగానే బొబ్బర్లంక–రావులపాలెం రహదారిలో రావచ్చన్నారు. ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని సీఐ కోరారు.

కెనరా బ్యాంకు మేనేజర్ బదిలీ



లక్కవరంలో బ్యాంకు మేనేజర్ షణ్ముఖను సన్మానిస్తున్న వర్తకులు, సిబ్బంది

మలికిపురం: మండలంలోని లక్కవరం కెనరా బ్యాంక్ మేనేజర్‌గా షణ్ముఖ సంతోష్ మూడు సంవత్సరాలు పనిచేసి ప్రమోషన్‌పై బెంగళూరు ఎంజీ రోడ్‌లోని కెనరా బ్యాంకుకు బదిలీ అయ్యారు. శుక్రవారం సాయంత్రం లక్కవరం బ్రాంచ్ మేనేజర్‌ను గ్రామ వర్తకులు, సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు. బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణ రాజు, స్టాఫ్, ఖాతాదారులు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించినారు. మేనేజర్ గారు బ్యాంకు చేసిన సేవలు అందరికీ అందుబాటులో ఉండేటట్లు చేసిన సందర్భంలో అభినందించారు. స్టాఫ్ సందీప్, సతీష్, సెల్వ కుమార్, ఖాతాదారులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఒక యువకుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన జొన్నకూటి శ్రీప్రకాష్ వయస్సు 22 సంవత్సరాలు ఇతనికి రెండు కిడ్నీలు పాడైపోయి గత కొన్ని నెలల నుంచి డయాలసిస్ చేయించడం జరుగుతుంది. వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. వైద్యానికి సహాయం కోరడంతో సంస్థ సభ్యులు అతని ఇంటికి వెళ్లి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

పరిసరాలను పొడిగా ఉంచుకోవాలి

అంబాజీపేట: వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాల వద్ద ఉన్న పరిసరాలను డ్రైగా ఉంచుకునేలా చూసుకోవాలని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, విష జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా దోమలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ, ఏఎన్ఎం ఎం.అర్జమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

యోగాతో ఆత్మస్థైర్యం పెంపు

అంబాజీపేట: విద్యార్థి దశ నుంచే యోగా శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందని, అందుకు అనుగుణంగా మేధాశక్తి పెరుగుతుందని అంబాజీపేట స్వామి వివేకనందా యోగా ఆశ్రమ యోగా గురువు శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులతో యోగ చేయించి, నీతి కథలు చదివించి, జాతీయ గీతాలను పాడించారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం ఆసక్తి పెంచుకోవాలన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: కొత్త కోర్సుల ప్రవేశం కోసం ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రభాకర్ తెలిపారు. ముమ్మిడివరంలో డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలకు సంబంధించి బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, మేజర్ సబ్జెక్టుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని వివరించారు. కొత్త కోర్సులు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ప్రవేశానికి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తారన్నారు. కళాశాలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తారని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.